# నూతన వేడుకలకు అనుమతి తప్పనిసరి

సిటీబ్యూరో, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ): నూతన సంవత్సర వేడుకలకు పోలీసు శాఖ అనుమతి తప్పనిసరి అని హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసులు తెలిపారు. అనుమతి లేకుండా కొత్త సంవత్సర వేడుకలు నిర్వహిస్తే ఈవెంట్ నిర్వాహకులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతేకాకుండా నూతన సంవత్సరం ఈవెంట్‌లో మద్యం వినియోగం ఉంటే కచ్చితంగా ఆబ్కారీ శాఖ అనుమతి తీసుకోవాలని సూచించారు. ఈవెంట్‌లో గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వినియోగం, అశ్లీల నృత్యాలు, అసభ్యకర చర్యలకు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. వేడుకల్లో మద్యం సేవించిన వారు తమ ఇళ్లకు తిరుగు ప్రయాణమయ్యే క్రమంలో వాహనాలను నడపకూడదని, డ్రైవింగ్ చేసేందుకు మద్యం సేవించని వారిని తోడుగా తెచ్చుకోవడం లేదా క్యాబ్స్, ఆటోల్లో ఇళ్లకు చేరుకోవాలని పోలీసులు సూచించారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే వారితో పాటు ఇతరులకు కూడా ప్రమాదకరమని, దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రజలు పోలీసులకు సహకరించి నూతన సంవత్సర వేడుకలను ఆనందంగా జరుపుకోవాలని సూచించారు. నూతన సంత్సరం సందర్భంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను ముమ్మరంగా నిర్వహించనున్నట్లు ట్రై కమిషనరేట్ల పోలీసులు వెల్లడించారు.


నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, శనివారం 28 డిసెంబర్ 2024 | HYDERABAD




సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో జనరల్ మేనేజర్ అరుణ్ జైన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

# ఆగని ట్రేడ్ లైసెన్స్‌ల దందా!

- ఏటా రూ. 400 కోట్లు రావాల్సిన చోట.. రూ. వంద కోట్లు దాటని కలెక్షన్లు
- లైసెన్స్‌లు ఇప్పిస్తామని కొందరు.. ఫీజు వసూలు చేసుకుని జేబులో వేసుకుంటున్న మరికొందరు
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేమితో క్షేత్రస్థాయి సిబ్బంది అడ్డగోలు దందా

## పక్కదారి పడుతున్న ఫీజు వసూళ్లు.. బల్దియా ఖజానాకు భారీ గండి





ట్రేడ్ లైసెన్స్ కలెక్షన్ ఇలా...

| ఏడాది | ట్రేడ్ లైసెన్స్‌లు | ఆదాయం రూ. కోట్లలో |
|---|---|---|
| 2018-19 | 40, 422 | 32.91 |
| 2019-20 | 39,501 | 34.47 |
| 2020-21 | 31,166 | 32.63 |
| 2021-22 | 34,813 | 46.37 |
| 2022-23 | 74,561 | 72.15 |
| 2023 | 1,06,333 | 81.92 |
| 2024 | 1,07,800 | దాదాపు 97 కోట్లు |

సిటీబ్యూరో: ట్రేడ్ లైసెన్స్ వసూళ్లు పక్కదారి పడుతున్నాయి. లైసెన్స్‌ల ఫీజు, వసూళ్ల బాధ్యత, పర్యవేక్షణ , సర్కిల్ అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ హెల్త్ (ఏఎంఓహెచ్)లకు అప్పగించగా..ఇందులో కొందరు ఎస్ఎఫ్ఏలు, ఏఎంఓహెచ్‌లు అక్రమాలకు తెరలేపారు. లైసెన్స్‌లు లేని వ్యాపారుల నుంచి అందినంత దండుకోవడం, ట్రేడ్ లైసెన్స్‌లు ఇప్పిస్తామని రూ.10వేలు అయ్యే చోట సదరు వ్యాపారస్తుడి నుంచి రూ. 60వేలు వసూలు చేస్తున్నారు. ఇటీవల జూబ్లీహిల్స్‌లో ఎస్ఎఫ్ఏలు ఈ అంశాలపైనే ఏసీబీకి చిక్కడం గమనార్హం. అంతేకాకుండా కొన్ని చోట్ల ఫీజు వసూళ్లలో చేతి వాటం ప్రదర్శిస్తున్నారు. జీహెచ్ఎంసీ వచ్చే ఆదాయాన్ని పక్కదారి పట్టించి ఖజానాకు గండి కొడుతున్నారు. వాస్తవంగా 20 ఫీట్ల మేర సింగిల్ లేన్ రోడ్డు ఉంటే చదరపు మీటర్‌కు రూ.3లు, డబుల్ లేన్ రోడ్డు ఉంటే 20 నుంచి 30 ఫీట్ల మేర ఉన్న రోడ్లపై చదరపు ఫీట్‌కు రూ.4, రెండు లేన్ల కంటే ఎక్కువగా ఉండి 30 ఫీట్లకు మించిన రోడ్లపై చదరపు మీటర్‌కు రూ. 6ల ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. దీంతో పాటు గ్రీనరీ చార్జీలు కూడా చెల్లించాలి. సంబంధిత వ్యాపారి నేరుగా ఆన్‌లైన్‌లో ఈ ఫీజు చెల్లించే వీలు ఉంటుంది. కానీ సర్కిల్‌లోని ఎస్ఎఫ్ఏలు వ్యాపారస్తుల వద్దకు వెళ్లి భేరసారాలు అడుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఉదాహరణకు రూ. లక్ష ఇచ్చే వారి దగ్గర రూ. 50వేల వరకు తీసుకుని వదిలేస్తున్నారు. సదరు వ్యాపారస్తుడి నుంచి వచ్చిన ఫీజు బల్దియా ఖజానాకు చేరడం లేదన్న ఆరోపణలు లేకపోలేదు.

### ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి..

గ్రేటర్ పరిధిలో చిన్న, పెద్ద వ్యాపారాలు కలిపి దాదాపు 12 లక్షల వరకు ఉన్నాయి. ఇందులో రూ. 2.5 లక్షలకు పైగా కమర్షియల్ భవనాలు ఉండగా.. ఈ వాణిజ్య భవనాలన్నింటికీ ట్రేడ్ లైసెన్స్‌లు కూడా జారీ చేయలేదు. ఏటా జీహెచ్ఎంసీకి ట్రేడ్ లైసెన్స్‌ల వసూళ్లలో ఆదాయం గణనీయంగా తగ్గుతున్నది. ఇందుకు వ్యాపారాలకు, వస్తున్న ఫీజులకు ఏ మాత్రం పొంతన ఉండటం లేదని రికార్డులే స్పష్టం చేస్తున్నాయి. గ్రేటర్‌లో ఏదైన వ్యాపారం నిర్వహించాలంటే ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి. అధికారులతో సంబంధం లేకుండా పౌరులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని అప్పటికప్పుడే లైసెన్స్‌లు పొందేందుకు వీలుగా జీహెచ్ఎంసీ ప్రవేశపెట్టింది. దరఖాస్తుదారులకే తమకు కావాల్సిన లైసెన్స్ సర్టిఫికెట్లను సృష్టించుకునే అవకాశం కల్పించినట్లయింది. జీహెచ్ఎంసీ అమలు చేస్తున్న 'ఇన్‌స్టాంట్ అప్రూవల్ విధానాన్ని మెజార్టీ దరఖాస్తులు దుర్వినియోగం చేస్తున్నారు. మమూలుగా ట్రేడ్ లైసెన్స్ రుసం.. దుకాణం విస్తీర్ణాన్ని బట్టి పెరుగుతూ ఉంటుంది. ఇక్కడే దీని నుంచి తప్పించుకునేందుకు చాలా మంది దుకాణాదారులు విస్తీర్ణాన్ని నామమాత్రంగా పేర్కొని తక్కువ రుసుంతో లైసెన్స్‌ను పొందుతున్నారు. ఈ రకంగా జీహెచ్ఎంసీ గడిచిన నాలుగేళ్లలో రూ.50కోట్ల నష్టం వాటిల్లినట్లు అంచనా. ట్రేడ్ లైసెన్స్‌ల జారీలోనే కాదు ప్రతి అంశంలోనూ కొందరు అధికారులు, సిబ్బంది అక్రమాలకు పాల్పడుతున్నారు. ట్రేడ్ లైసెన్స్‌లలో ట్రేడ్ ఇండెక్స్ నంబరు (టిన్) ఇవ్వకుండా ప్రొవిజన్ విధానంలో.. ప్రాపర్టీ ట్యాక్స్ రెసిడెన్షియల్.. రెండు మూడింతలు పెరుగుతది. ట్రేడ్ లైసెన్స్ పాత ట్రేడ్ ఇండెక్స్ నంబరు.. ఈజీగా ఇవ్వరు.. ప్రొవిజన్ విధానంలో కొనసాగిస్తూ వ్యాపారస్తులతో క్షేత్రస్థాయిలో కొందరు అధికారులు అందినంత దండుకుంటున్నారన్న విమర్శలు లేకపోలేదు.

# ఆర్‌యూబీల నిర్మాణ పనులను ప్రారంభించండి

## రైల్వే జీఎంకు ఎమ్మెల్యే మర్రి వినతి

## జీఎం సానుకూలంగా స్పందించినట్లు వెల్లడి

మల్కాజిగిరి: ఆర్‌యూబీల నిర్మాణ పనులను ప్రాంభించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో జనరల్ మేనేజర్ అరుణ్ జైన్‌ను కలిసి ఆర్‌యూబీల నిర్మాణ పనులను ప్రారంభించాలని ఎమ్మెల్యే వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానం ప్రకారం రైల్వే ప్రాజెక్టు నిర్మాణ పనులను మంజూరు చేయించడానికి కృషి చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే ప్రణాళికతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో వాజ్‌పేయినగర్, గౌతం నగర్ ఆర్‌యూబీల నిర్మాణాల కోసం అన్ని అనుమతులు తీసుకున్నామని తెలిపారు. ఇప్పటికే అనుమతులు వచ్చిన వాజ్‌పేయినగర్, గౌతంనగర్ రైల్వే లెవల్ క్రాసింగ్‌ల వద్ద ఆర్‌యూబీల నిర్మాణ పనులు ప్రారంభించాలని రైల్వే జనరల్ మేనేజర్‌ను కోరినట్లు వెల్లడించారు. నేరేడ్‌మెట్ వద్ద రామకృష్ణాపురం ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద అదనంగా రెండు లైన్ల రోడ్డును నిర్మించాలని, తుర్కపల్లి వద్ద ఆర్‌యూబీ నిర్మాణం కోసం అన్ని అనుమతులు వచ్చాయన్నారు. బొల్లారం బజార్ కొత్త బస్తీ వద్ద రైల్వే స్థలంలోని నాలా సమస్యను టన్నెల్‌ను విస్తరించి పరిష్కరించాలన్నారు. మిర్జాలగౌడ్ శ్రీరేణుకా ఎల్లమ్మ దేవాలయం, మల్కాజిగిరిలోని రైల్వే క్వాటర్స్ వద్ద దుర్గామాత దేవాలయాల స్థలాలకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. వినాయక్‌నగర్ డివిజన్ కేశవనగర్‌లోని రైల్వే స్థలంలో పేద మహిళలు కుట్టు మిషన్ ఏర్పాటు చేసుకుని జీవనోపాధి పొందుతున్నారని, అక్కడ రైల్వే అధికారులు ఖాళీ చేయాలని బోర్డు పెట్టారన్నారు. వినతిపై రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ జైన్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీశ్‌గౌడ్, రమేశ్, అనిల్‌కిశోర్, జీకే హన్మంతరావు, చిన్నయాదవ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### వైస్ చైర్‌పర్సన్ నియామకంపై హర్షం

విద్యార్థులకు విదేశీ విద్య అందని ద్రాక్షేనా అని అసెంబ్లీలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఈనెల 18న లేవనెత్తిన అంశానికి ప్రభుత్వం స్పందించింది. అసెంబ్లీలో విదేశీ విద్యార్థుల ఫీజుల బడ్జెట్‌పై ఎమ్మెల్యే ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు దేవాదాయ శాఖ ముఖ్యకార్యదర్శి శైలజా రామయ్యర్‌ను వైస్ చైర్‌పర్సన్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ బ్రాహ్మణ విద్యార్థులకు ఓవర్సీస్ స్కాలర్ షిప్ అందజేయడంలో జాప్యం జరుగుతుందని చెప్పారు. ఇప్పటికే వివిధ దేశాల్లో చదువుతున్న విద్యార్థులకు సకాలంలో ఫీజులు అందక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఆర్థిక సంవత్సరంలో 100 కోట్ల బడ్జెట్ కేటాయించినా ఇప్పటికీ రూ.30 కోట్లు మాత్రమే విడుదల చేశారని అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వం నుంచి నుంచి ఆర్థిక సహాయం(స్కాలర్ షిప్) అందుతుదన్న నమ్మకంతో విదేశాలకు వెళ్లి గోస పడుతున్నారన్నారు.

చాలా మంది అర్చక వృత్తిని ఉపాధిగా చేసుకున్న పేద బ్రాహ్మణుల పిల్లలు ప్రభుత్వ స్కాలర్‌షిప్‌లను నమ్ముకొని విదేశాలకు వెళ్లి అక్కడ సరైన ఉద్యోగాలు దొరక్క తిరిగి స్వదేశానికి రాలేక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఓవర్సీస్ స్కాలర్ షిప్‌లను విడుదల చేసి విద్యార్థులను ప్రభుత్వం అందుకోవాలని అసెంబ్లీలో స్పీకర్ ద్వారా ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం స్పందించి.. తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు వైస్ చైర్ పర్సన్‌ను నియమించడం హర్షణీయమని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు.

# తప్పులేకున్నా..చితకబాదిన ఖాకీలు

లాఠీ కాఠిన్యం

- దొంగతనానికి పాల్పడ్డాడన్న అనుమానంతో.. నిమ్స్ కార్మికుడిని అదుపులోకి తీసుకున్న పంజాగుట్ట పోలీసులు
- చివరకు తప్పు చేయలేదని నిర్ధారణ..
- వైద్యశాల గేటు ఎదుట వదిలివెళ్లిన వైనం
- దెబ్బలకు తాళలేక ఆస్పత్రి గేటు ముందు సొమ్మసిల్లి పడిపోయిన బాధితుడు
- ఎమర్జెన్సీ వార్డులో చేర్చిన తోటి కార్మికులు
- ఆందోళనకు దిగిన కార్మికులు, కార్మిక సంఘాలు
- మేము ఎలాంటి ఫిర్యాదు చేయలేదు: నిమ్స్ డైరెక్టర్
- రోగి, సెక్యూరిటీ అధికారి ఫిర్యాదు చేశారు: సీఐ





నిమ్స్ వైద్యశాలలో నిరసన తెలుపుతున్న కార్మిక సంఘం నేతలు



చికిత్స పొందుతున్న బాధితుడు లింగయ్య

ఖైరతాబాద్: చేయని తప్పునకు నిమ్స్ కార్మికుడిని పోలీసులు చితకబాదారు. చివరకు తప్పు చేయలేదని నిర్ధారణ కావడంతో అతడిని నిర్లక్ష్యంగా ఆస్పత్రి గేటు ముందు పడేసి వెళ్లిపోయారు. ఈ అవమానీయ ఘటన పంజాగుట్ట పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల దెబ్బలకు నిమ్స్ గేటు ముందు సొమ్మసిల్లి పడిపోయిన బాధితుడిని తోటి కార్మికులు ఎమర్జెన్సీ వార్డులో చేర్చారు. నిమ్స్ కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు తెలిపిన వివరాల ప్రకారం....దుండిగల్‌కు చెందిన రవికుమార్ నిమ్స్‌కు చికిత్స కోసం వచ్చాడు. వైద్యులు ఎంఆర్ఐ చేయించాలని సూచించగా, ఆ విభాగానికి వెళ్లి ఎంఆర్ఐ స్కానింగ్ కోసం సిద్ధమయ్యాడు. కానీ ఎంఆర్ఐ కోసం వచ్చే వారి వెంట తప్పనిసరిగా ఓ సహాయకుడు ఉండాలి. అతడి వెంట ఎవరూ లేకపోవడంతో ఆ విభాగంలో పనిచేస్తున్న లింగయ్య అనే కార్మికుడికి సెల్‌ఫోన్, దుస్తులను ఇచ్చి స్కానింగ్ చేయించుకున్నాడు. స్కానింగ్ ముగిసిన తర్వాత బయటకు వచ్చిన రవికుమార్‌కు లింగయ్య దుస్తులు, సెల్‌ఫోన్‌ను అందించాడు. తన బంగారు గొలుసు కూడా ఇచ్చానని, దానిని కూడా ఇవ్వాలని కోరాడు. తనకు ఫోన్, దుస్తులు తప్ప.. ఎలాంటి ఆభరణం ఇవ్వలేదని చెప్పినా.. వినకుండా తన గొలుసు మాయం చేశాడంటూ గొడవకు దిగాడు. అంతటితో ఆగకుండా సెక్యూరిటీ కార్యాలయానికి చేరుకొని సెక్యూరిటీ అధికారికి విషయం చెప్పాడు. తాను దొంగతనం చేయలేదని లింగయ్య చెప్పినా.. వినకుండా సదరు సెక్యూరిటీ ఆఫీసర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులకు దొంగతనం చేయలేదని లింగయ్య ఎంత చెప్పినా.. వినకుండా బలవంతంగా పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఇక్కడ సీన్ కట్ చేస్తే.....గురువారం రాత్రి లింగయ్య నిమ్స్ మొదటి గేటు ముందు అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. గమనించిన సిబ్బంది ఎమర్జెన్సీ వార్డుకు తీసుకెళ్లారు. ఒంటి నిండా గాయాలతో ఉన్న లింగయ్య తనకు జరిగిన అన్యాయాన్ని తోటి కార్మికులకు చెప్పాడు. తాను దొంగతనం చేశానని రోగి రవికుమార్ నిమ్స్ సెక్యూరిటీ అధికారి రామారావుకు ఫిర్యాదు చేయడంతో తనను పోలీసులకు అప్పగించారని, పోలీసులు స్టేషన్‌లో తనను చితకబాదారన్నాడు. చివరకు బంగారు గొలుసు ఆ రోగి జేబులోనే దొరకిందని నిర్ధారించుకొని తనను తీసుకువచ్చి గేటు ముందు పడేసిపోయారని వాపోయాడు. లింగయ్యపై చేయని దొంగతనం నిందమోపడంతో పాటు పోలీసులు చితకబాదడాన్ని ఖండిస్తూ కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు ఎమర్జెన్సీ వార్డు వద్ద నిరసన తెలిపారు. డ్యూటీ ఆర్ఎంవో వచ్చి సమస్యను పై అధికారుల దృష్టికి తీసుకెళ్తానని, లింగయ్యకు న్యాయం జరిగే విధంగా చూస్తానని చెప్పడంతో నిరసన విరమించారు.

### సెక్యూరిటీ అధికారిపై చర్యలు తీసుకుంటాం..

నిమ్స్ దవాఖానలో దొంగతనం జరిగిన విషయంపై ఎలాంటి సమాచారం లేదు. దొంగతనం వంటి ఘటనలు జరిగితే ముందుగా నాకు గాని, సూపరింటెండెంట్, ఆర్ఎంవోకు గాని ఫిర్యాదు చేయాలి. ఈ ఘటనపై నేను పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. జరిగిన విషయాన్ని తెలుసుకొని పూర్తి స్థాయిలో విచారణ చేపడుతాం. విధుల్లో నిర్లక్ష్యం వహించడంతో పాటు నిజ నిజాలు తెలుసుకోకుండా కార్మికుడిపై తప్పుడు ఫిర్యాదు చేసి అతడిని ఇబ్బందులకు గురిచేసిందుకు సెక్యూరిటీ అధికారి రామారావుపై పోలీసులకు ఫిర్యాదు చేస్తాం. అతనిపై చర్యలు తీసుకుంటాం.

-డాక్టర్ నగరి బీరప్ప, నిమ్స్ డైరెక్టర్

### రోగి, సెక్యూరిటీ అధికారి ఫిర్యాదు చేశారు

నిమ్స్ దవాఖానలో బంగారు గొలుసు దొంగతనం జరిగినట్లు మాకు సమాచారం వచ్చింది. దుండిగల్‌కు చెందిన రోగి రవికుమార్, సెక్యూరిటీ అధికారి రామారావుతో కలిసి మాకు ఫిర్యాదు చేశారు. విచారణలో దొంగతనం జరుగలేదని తెలియడంతో లింగయ్యను వదిలేశాం.

- శోభన్, పంజాగుట్ట సీఐ

### విచారణ చేయకుండా.. చితకబాదడం హేయమైన చర్య

ఎలాంటి విచారణ చేపట్టకుండా చేయని దొంగతనానికి కార్మికుడు లింగయ్యను పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి పోలీసులు చితకబాదడం హేయమైన చర్య. నిమ్స్‌లో దొంగతనం ఘటనలు జరిగితే ముందుగా సూపరింటెండెంట్, ఆర్ఎంవో దృష్టికి తీసుకెళ్లాల్సి ఉంటుంది. కానీ వారి దృష్టికి తీసుకెళ్లకుండానే సెక్యూరిటీ అధికారి రామారావు నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తప్పుడు ఫిర్యాదు చేసిన సెక్యూరిటీ అధికారితో పాటు నిర్ధారణ చేసుకోకుండానే అమాయక కార్మికుడిని చితకబాదిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి. బాధితుడికి న్యాయం చేయాలి. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తాం.

-నిమ్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ నేత వెంకటేశ్

# ఇంకెన్నాళ్లు?

ఎల్ ఆర్ఎస్ దరఖాస్తులపై హెచ్ఎండీఏ తర్జనభర్జన

సిటీబ్యూరో: ల్యాండ్ రెగ్యులైజేషన్ స్కీం దరఖాస్తులకు గ్రహణం పట్టుకున్నట్లు ఉంది. హెచ్ఎండీఏ పరిధిలో క్రమబద్ధీకరణకు వచ్చిన సుమారు మూడున్నర లక్షల దరఖాస్తులపై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి. హైడ్రా, ఎన్ఓసీ వంటి కారణాలతో దరఖాస్తులను అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికే ఫీజులు చెల్లించిన దరఖాస్తుదారులు కూడా ఆందోళన చెందుతున్నారు. దరఖాస్తుల ప్రక్రియ ఎప్పుడు పూర్తవుతుందనేది ఆందోళన కలిగిస్తున్నది.

### తప్పని ఇబ్బందులు..

హెచ్ఎండీఏ పరిధిలో పెండింగ్‌లో ఉన్న 3.60లక్షల ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల విషయంలో అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. హెచ్ఎండీఏ పరిధిలో సుమారు 3.60లక్షల మంది ఓపెన్ ప్లాట్లను క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోగా, ఇందులో 1.16 లక్షల దరఖాస్తులను పరిశీలించారు. వీటిలో 80వేలకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి. వీటితోపాటు మరో 75వేల దరఖాస్తులను షార్ట్ ఫాల్స్ చూపుతూ కొర్రీలు పెట్టారు. ప్రీలిమినరీ ఎలిమినేషన్ ప్రక్రియ ముగియగా... ఫీజులు చెల్లించిన దరఖాస్తులను పరిశీలించి షార్ట్ ఫాల్స్ పేర్కొంటూ దరఖాస్తుదారులకు సమాచారం ఇస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రాకపోవడంతో అధికారులు అయోమయానికి గురవుతున్నారు. దీంతో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియ నెలల తరబడి కొనసాగుతూనే ఉంది. అయితే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వేగంగా పరిష్కారించాలని భావించింది. కానీ తాజాగా హైడ్రా, జీపీ లేఅవుట్ల ప్లాట్లపై స్పష్టమైన ఆదేశాలు లేకపోవడంతో దరఖాస్తుదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

### ఏడాది కాలంగా..

ఏడాది కాలంగా దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి. అసలు ఎల్ఆర్ఎస్ ప్రక్రియ ఎప్పుడూ పూర్తి అవుతుందని దరఖాస్తు దారులు వాపోతున్నారు. ముఖ్యంగా షార్ట్ ఫాల్స్ విషయంలో దరఖాస్తుదారులకు తలనొప్పులు తప్పడం లేదు. ముఖ్యంగా హైడ్రా వచ్చిన తర్వాత రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల నుంచి వచ్చే ఎన్ఓసీలు అత్యంత కీలకంగా మారడంతో.. అసలు తమ భూములు రెగ్యులర్ చేస్తారా లేదా అనేది ఇప్పటికీ తెలియడం లేదు.







# డ్యూటీ ఫ్రీ లిక్కర్ దందా

ఇద్దరు ఆర్‌జీఐఏ పోలీసులు అరెస్టు.. ఖరీదైన మద్యం స్వాధీనం



సిటీబ్యూరో/ డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ)/శంషాబాద్ రూరల్: ఆర్‌జీఐఏ ఠాణాకు చెందిన కానిస్టేబుల్, హోంగార్డులు డ్యూటీ ఫ్రీ మద్యం విక్రయిస్తూ..పట్టుపడ్డారు. నిందితుల వద్ద నుంచి రూ.15లక్షల విలువ చేసే మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. శంషాబాద్ ఈఎస్ కృష్ణప్రియ కథనం ప్రకారం.. శంషాబాద్, రాయల్ విల్లాస్ ప్రాంతానికి చెందిన ఎం.జిమ్యా నాయక్ ఆర్‌జీఐఏ పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్. బుద్వేల్‌కు చెందిన బండారి లింగయ్య అదే పోలీసు స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్నాడు. వీరిద్దరూ విమానాశ్రయంలోని పోలీసు ఔట్‌పోస్టులో వీఐపీ ప్రొటోకాల్ విధులు నిర్వర్తిస్తున్నారు. జిమ్యా నాయక్‌కు ఎయిర్‌పోర్ట్‌లోని డ్యూటీ ఫ్రీ మద్యం దుకాణం బిల్లింగ్ కౌంటర్‌లో పనిచేసే మహేశ్వర్‌తో పరిచయం ఏర్పడింది. ముగ్గురు కలిసి విదేశాల నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చే ప్రయాణికుల పాస్‌పోర్ట్, బోర్డింగ్ పాస్‌ల మీద ప్రతిరోజూ 10నుంచి 20వరకు డ్యూటీ ఫ్రీ మద్యాన్ని కొనుగోలు చేసి మార్కెట్లో అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. శంషాబాద్ డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ బి.ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డిలు తమ బృందంతో కలిసి కానిస్టేబుల్ జిమ్యా నాయక్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతడి వద్ద మద్యం కొనుగోలు చేసిన మాదాపూర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ గీధర హరీశ్‌కుమార్‌ను సైతం అదుపులోకి తీసుకుని గౌలిదొడ్డికి చెందిన రాఘవేంద్రరావుకు గోల్డ్‌లేబుల్ బాటిళ్లు విక్రయించినట్లు కానిస్టేబుల్ విచారణలో వెల్లడించడంతో అతడి కారును తనిఖీ చేయగా 8 గోల్డ్ లేబుల్ మద్యం బాటిళ్లు లభించాయి. ఈ మేరకు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. మరో కేసులో డ్యూటీ ఫ్రీ మద్యం విక్రయిస్తున్న ఆర్‌జీఐఏ హోంగార్డు బండారి లింగయ్యను పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.